

"మీవాళ్ళు మన పెళ్ళికి అంగీకరిస్తారా ?"

రాజు చిన్నగా నవ్వి మేరి వైపు చూస్తూ "ఏమో ?" అన్నాడు.

"అంటే...?"

"చూడు మేరీ... సనాతనాచారాలు తు.చ. తప్పకుండ పాటిస్తున్నారు మా వాళ్ళు. తనలాంటి కోడలు రావాలంటుంది మా అమ్మ. నాపై వచ్చిన కట్నంతో మా చెల్లెలు పెళ్ళి చేయాలంటారు మా నాన్న. అందుకే మన పెళ్ళికి ఒప్పుకోరనుకుంటాను."

నడుస్తున్న మేరి చటుక్కున ఆగి ఆశ్చర్యంగా రాజు ముఖంలోకి చూసింది.

"మా వాళ్ళు వద్దన్నా, ఎందరు ఆక్షేపణ తెలిపినా మన పెళ్ళి జరగక మానదు."

"రాజు... !" ఆమె కళ్ళలో ఆనంద భాష్పాలు నిలిచాయి. ఆప్యాయంగా అతని చేయి నొక్కింది

* * *

"నీవు అంటున్నది ఏమిట్రా ? కులం తక్కువదాన్ని పెళ్ళిచేసుకొని మన కుల గౌరవాలు మంట కలుపుతావా ?" కొడుకు వైపు కోపంగా చూసింది పార్వతమ్మ.

"మనిషి బ్రతకటానికి కులం ముఖ్యం కాదమ్మా!"

"నీకు కాక పోవచ్చు. కాని, మాకు కావాలి. ఫలానా వారి అబ్బాయి కులం తక్కువ దాన్ని పెళ్ళిచేసుకున్నాడంటే, మన పరువు ప్రతిష్ఠలు ఏమౌతాయో ఆలోచించావా?"

"ఏమీ కావు... చూడమ్మా ! మారుతున్న కాలంతోపాటు మనమూ మారాలి."

"చూడు రాజూ! జీవితమంటే కథలు, కావ్యాలు కావు. మారుతున్న కాలంతోపాటు మారాలంటావు. నీవు మారగలవు అన్నీ మరచిపోగలవు. కాని, నీపై ఆశలు పెట్టుకున్న మా గతి ఏం కావాలి ?" కొడుకు వైపు చూస్తూ ప్రశ్నించారు శేషయ్యగారు

"నా బాధ్యతలు మరచి పెళ్ళిచేసుకొని వేరేపోవటంలేదుగా నాన్నా!"

"ఛస్తే, ఆ కులంతక్కువదాన్ని ఇంట్లో అడుగుపెట్టనివ్వను."

తల్లివైపు బాధగా చూశాడు రాజు.

"చూడు రాజూ ! మంచి సంబంధం చూసి నీకు పెళ్ళిచేసి, నీపై వచ్చిన కట్నంతో కమల పెళ్ళిచేయాలని ఆశించాను. కాని, నా ఆశలన్నీ..."

"నెరవేరుస్తాను నాన్నా. అప్పుచేసి నా చెల్లెలు పెళ్ళి నే చేస్తాను. నేనూ, మేరీ ఉద్యోగం చేసి ఆ అప్పు తీరుస్తాం నాన్నా."

"అంటే... నీవా అమ్మాయిని పెళ్ళిచేసుకోక తప్పదా ?" సూటిగా ప్రశ్నించారు శేషయ్యగారు.

"నన్ను అర్థంచేసుకోండి నాన్నా. మనిషి మనుగడకు కులం ముఖ్యం కాదు ప్రేమ, మమత, మమకారాలకు కులం అడ్డుగోడ కాదు...కాకూడదు...

కాగితంపై కలం ఆగిపోయింది. నా శ్రీమతి అరుపులకు ఈ లోకంలోకి వచ్చాను.

"అబ్బబ్బా ... ఎంతసేపటినుండి పిలిచినా ఉలుకు, పలుకు లేదేమిటి ?" అంటూ హడావిడిగా వచ్చింది శాంత.

"ఎందుకు ?"

"ఎందుకా ?... నిన్నటినుండి చెబుతున్నా తీరా, సమయానికి 'ఎందుకు?' అని ప్రశ్నిస్తున్నారా ?" అంతేలెండి నేనన్నా, నా వాళ్లన్నా

మీకు ఆప్యాయతగాని, అనురాగం గాని ఎక్కడున్నాయ్ ?"

'శాంతా! విసిగించకుండా అసలు విషయం ఏమిటో చెప్పు."

"ఏమిటీ నేను మిమ్మల్ని విసిగిస్తున్నానా ?"... అంతేలెండి, నేనంటే ఇష్టం ఉంటేగా ?... నేను ఏమీ మాట్లాడినా మీకు విసుగ్గానే ఉంటుంది."

"శాంతా..." ఒకవైపు కోపం, మరోవైపు బాధ.

"ఎందుకండీ ఆ అరుపులు. అయినా అంత ఇష్టం లేనివారు నన్నెందుకు పెళ్ళిచేసుకున్నారు ? నా బ్రతుకు బండలుచేయడానికా ?... డబ్బు కోసం ఆడదాని జీవితాన్ని నాశనం చేస్తారా?.. మీరు మని..."

నేను ఆగలేకపోయాను ......... కోపంతో...శాంత చంప చెళ్ళుమంది...

"నన్నే కొడతారా ? ... అంతే లెండి... చాతగాని మగాడు పెళ్ళాన్ని కొట్టడంకన్నా ఏం చేయగలడు ?..."

నాకు అక్కడ ఉండాలనిపించలేదు. గబగబ బయటికి వచ్చేశాను ... నడుస్తున్నాను... దూరంగా వెళ్ళాలి... నిర్జీవ ప్రదేశానికి వెళ్ళాలి... ఏడ్వాలి.. బాగా ఏడ్వాలి...

'డబ్బు కోసం ఆడదాన్ని మోసం చేసాను.'... కాని, నిన్ను కాదు శాంతా,.. నిన్ను కాదు ... సరోజ ... అవును సరోజ... నా మాటలకు మోసపోయింది.

'ప్రపంచమంతా ఒక్కటైనా సరే, మన పెళ్ళిని ఆపలేరు సరోజా'

'రవీ! నీ మాటలు వింటూ, నీ ప్రక్కన ఇలా కూర్చుంటే...'

నా మాటలన్నీ వట్టి నీటి మూటలని, నే చేసిన ప్రమాణాలన్నీ కల్లలని తెలుసుకోలేకపోయింది... పిచ్చిపిల్ల...

'నీవు దాన్ని చేసుకోవడానికి వీల్లేదు.. నీకు సంబంధం ఖాయపరిచాము... నీకు వచ్చే కట్నంతో సుమకు పెళ్ళి కూడా ఏర్పాటుచేశాము.'

'అమ్మా! ఇది అన్యాయం... నేను పెళ్ళిచేసుకుంటానని సరోజకు మాట ఇచ్చాను.'

'నేను వాళ్ళకు మాట ఇచ్చాను. నీవు పెళ్ళిచేసుకోక తప్పదు.'

'నాన్నా...'

'అవును రవి... తప్పదు'

'ఎలా నాన్నా సరోజను మనసారా ప్రేమించాను. నేను లేనిదే సరోజ...'

'బ్రతకదు... కాని, మేము మాత్రం బ్రతకగలమా?... ఇచ్చినమాట విఫలమైతే...'

'అందుకని నా జీవితం...'

'నాశనం అవుతుందంటావ్? కాదు.. ఎన్నటికీకాదు... తల్లి దండ్రులు బిడ్డల భవిష్యత్తు నాశనంచేయరు. తమ బిడ్డలు బాగుండాలని ఆశిస్తారు ... వారికి

బంగారు బాట చూపుతారు... అలాగే నేను ఆశించాను... అది నా తప్పా?... ఆ మాత్రం అధికారం నాకు లేదా?... అధికారంతో ఆజ్ఞాపించుట లేదు, ఆవేదనతో అర్థిస్తున్నాను.... నా మాట మన్నించు రవీ!...'

'నాన్నా...'

అంతే... నోట మాట రాలేదు... నా మౌనమే నన్ను సరోజనుండి దూరం చేసింది... శాంత మెళ్ళో తాళి కట్టించింది...

అటు సరోజను మరచిపోలేక, ఇటు శాంతను సంతోషపరచలేక నలిగి పోతున్నాను. నేను చేసిన పాపానికి ప్రాయశ్చితం అనుభవించాలి, తప్పదు. అందరినీ ఎదిరించి పెళ్ళిచేసుకుంటానని సరోజకు మాట ఇచ్చాను. కాని.. కాని.. ఓడిపోయాను ... పెద్దవారి దుఃఖాశ్రువుల్లో కరిగిపోయాను ... విధి చేతుల్లో కీలుబొమ్మ నయ్యాను... నేను ఓడిపోయినా, నా పాత్ర ఓడిపోకూడదు. పెద్దవారిని ఎదిరించాలి... మేరీని పెళ్ళి చేసుకోవాలి. ఆదర్శవంతుడు కావాలి... రాజు జయించాలి.. అవును జయించాలి..

గబ, గబ ఇంటిముఖం పట్టాను... అందరూ నిద్రపోతున్నారు... రూంలోకి వెళ్ళాను... ప్యాడ్ చేతిలోకి తీసుకున్నాను ... ఇంతవరకు వ్రాసింది చదివాను.

"ప్రేమ, మమత, మమకారాలకు కులం అడ్డుగోడ కాకూడదు...

నా కలం కదిలింది...

"కాలం మారుతుంది... మనిషి చంద్రమండలానికి వెళ్ళి వస్తున్న ఈ రోజుల్లో కూడా కులాలు, గోత్రాలు ఏమిటి నాన్నా... అసలు ఎక్కువ, తక్కువలు ఎందుకుండాలి? భర్త మరణించగానే జీవితాన్ని అంధకారం చేసుకునే రోజులు పోయాయి... మళ్ళీ పెళ్ళి చేసుకుంటున్నారు... సమాజంచే మోసగింపబడ్డ స్త్రీలకు చేదోడు లభిస్తుంది... రోజు, రోజుకు మనిషి ప్రగతి పథంలో ముందుకు పరుగెడుతున్నాడు ... సంకుచిత భావాన్ని పారద్రోలాలి... విశాల దృక్పథంతో ఆలోచించాలి ... నేను చేస్తున్నది తప్పుకాదు, అంతకన్న పాపము కాదు..."

"రాజు ...! ఆఖరిసారిగా అడుగుతున్నాను ఆ అమ్మాయిని మరచిపో.."

"సాధ్యంకాదు నాన్నా"

" అంటే... కన్న తల్లి దండ్రుల కన్నా, అదే నీకు ఎక్కువా...?"

పార్వతమ్మ కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

"మేరి మీకన్నా ఎక్కువని నే నెన్నటూ చెప్పను, చెప్పలేను. తల్లి దండ్రులతో సమానమైనది ఏదీ లేదు"

"అన్నీ తెలిసే చేస్తున్నావా?"

" నాన్నా! నా మాట వినండి.

నే పెళ్ళి చేసుకుంటే ఎవ్వరికీ, ఏకష్టమూ ఉండదు, "

" అని సువ్వనుకుంటున్నావు ... కాని, మన కులం మంటలో కలుస్తుంది.. వీల్లేదు... నీవు మొండిపట్టు మానక పోతే, నీకి ఇంట్లో స్థానంలేదు."

"నాన్నా...?"

"మా మాట వినరా..."

"నన్ను మన్నించండమ్మా... సరే మీ ఇష్ట ప్రకారమే కానీ నాన్నా...నేను ఎక్కడున్నా మీ కొడుకునే... నేను దూరంగా వుండే కమలపెళ్ళి చేస్తాను."

" వీల్లేదు... నీ నీడ ఈ ఇంటిపై పడటానికి వీల్లేదు... వెళ్లు..." శేషయ్య గారు గంభీరంగా అన్నారు.

"రాజు...!" పార్వతమ్మ ఏడ్చింది.

రాజు బయటికి నడిచాడు.

* * *

సంతృప్తిగా నిట్టూర్చాను... నేను జయించకపోయినా, రాజు ఎదిరించి జయించాడు ... నాలో నేనే గర్వ పడ్డాను.

కథను పూర్తిచేసి పత్రికకు పంపాను. ప్రచురితమైంది... కథ ద్వారా నేను జయించానని సంతోష పడ్డాను... నేనూ రచయిత నయ్యాను... నాలో నేనే నవ్వుకున్నాను.

ఈ విజయంతో మరో కథ వ్రాయ టానికి పూనుకున్నాను... ఆలోచిస్తూ ఈజీచేర్‌లో కూర్చున్నాను. నా కోసం ఎవరో వచ్చారని పనిమనిషి చెప్పింది క్రిందకు వచ్చాను... హాల్లో నిలబడి ఉన్నారు... వాళ్ళను సమీపించాను... ఆమెను చూశాను— నాకు తల తిరిగి నట్లయింది... ఆమె...ఆమె... సరోజ అవును సరోజ ... ఇక్కడి కెలా వచ్చింది? ... ఎందు కొచ్చింది?... చేతిలో పాప ఉంది... ప్రక్కన ఒక యువకుడు... ఎవరు?... అర్థంకాలేదు ఆలోచనలతో సతమతమయ్యాను ... నోట మాటరాలేదు... సరోజ నన్ను చూసి నిర్ఘాంతపోయింది.

" రవిగారు మీరేనా...? " అతను పలకరించాడు.

" ఆ(... " అనగలిగాను.

" నా పేరు మధు. మీ కథ చదివి మిమ్మల్ని కలసిపోదామని వచ్చాము."

"...కూర్చోండి."

సోఫాలో కూర్చున్నారు ... నేను కూర్చున్నాను.

" ఈవిడ నా భార్య..."

" నమస్కారమండి... " సరోజ మరో వైపు చూస్తూ నమస్కరించింది.

" నమస్కారం... "

" మీ కథ చదివి ఉత్తేజితుడనై ఈ సరోజను పెళ్ళి చేసుకున్నాను. "

మధు మాటలకు ఆశ్చర్యంగా అతని ముఖంలోకి చూశాను.

" అవునండి ... సరోజ మా పక్కింట్లో ఉంటూ టీచరు ఉద్యోగం

చేస్తూవుండేది... నేను ప్రేమించాను... పెళ్ళి చేసుకోవాలని ఆశించాను... కాని, నిరాకరించింది..."

"కారణం..?" అప్రయత్నంగా అడిగాను.

"ఇదివరకు ఎవరివల్లనో మోస పోయి ఈ బిడ్డకు తల్లి అయింది..."

సరోజ ముఖంలోకి చూశాను... ఆమె పాప తల చేతితో దువ్వుతూంది...

అంటే... అంటే... ఆ పాప... నా మనసు బాధతో మూలిగింది... ఎవరో నా గుండెను సూదితో గుచ్చుతున్నట్లనిపించింది... నా పాపానికి ఫలితం ఈ పాప..

మధు చెప్పుకుపోతున్నాడు "నా ప్రేమకు ఈ అల్పకారణం అడ్డుకాలేదు. జీవితంలో ఒక మంచికార్యం చేస్తున్నాననే తృప్తి కలిగింది. ఇంట్లో మా తల్లి దండ్రులను ఎదిరించాను... ఆ సమయంలో మీ కథ చదవడం జరిగింది... ఒక నిర్ణయానికి వచ్చాను. సరోజను పెళ్ళిచేసుకున్నాను. ఈ పాపను, నా పాపగా అంగీకరించాను... ఇటువంటి ఉత్తమ కథలను వ్రాసి, నాలాంటివారికి ఉత్తేజాన్ని కలిగిస్తున్న మిమ్మల్ని చూసిపోదామని వచ్చాము."

నా కళ్ళలో నీళ్ళు నిండాయి... ఏమి చెప్పాలో అర్థంకాలేదు... సరోజను చూశాను... నావైపు చూసింది... ఆ చూపులు 'కథను చదివి ఉత్తములను కున్నాను... కాని, ఆడదాని జీవితంతో ఆడుకునే వంచకు లనుకోలేదు... ఇలా ఎందరిని మోసంచేస్తారు?...' అన్నట్టుగా ఉన్నాయి. నా చూపులు దించేశాను.

"మీరిలా ఉత్తమ కథలు వ్రాస్తూ, సమాజం మార్పుకు దోహదం చేయగల రని ఆశిస్తున్నాను."

మధు వైపు చూశాను. మంచిపని చేశాననే తృప్తి అతని ముఖంలో కనిపించింది... నిజమే... జయించింది నేను కాదు...

"వస్తాం అండీ..." మధు లేచాడు. సరోజ లేచింది.

ఏదో చెప్పాలనుకున్నాను.. క్షమించమని సరోజను అడగాలనుకున్నాను... మధుకు కృతజ్ఞత తెలుపాలనుకున్నాను .. కాని, గొంతులో తడి ఆరిపోయింది ... మాటలు రాలేదు కనీసం కాఫీ కూడా ఇవ్వలేదు... వెనక్కు పిలవాలనుకున్నాను... నోట మాట రాలేదు .. చేతులెత్తి నమస్కరించాను... వారు వెళ్ళిపోయారు... నా కళ్ళలోనుండి నీరు ఏకధాటిగా రాసాగాయి .. జయించింది నేను కాదు.

